

# ఈ కథ ఇంతే?

గుత్తుల భాస్కర రావు

పెద్దవాళ్ళ పాలిట వరం పేదవాళ్ళ పాలిట శాపం అని చెడ్డ పేరు తెచ్చుకున్న చలి ఆ రాత్రి చలి చావుల రికార్డు స్థాపించేస్తాయికి విజృంభించింది.

పెళ్ళలు విరిగి, పెంకు లూడి చర మాంకం చేరుకున్న పెంకుటిల్లు దక్షిణం వేపు గదిలోంచి సన్నగా, విషాదంగా వయొలిన్ గీతిక వినిపిస్తోంది. రామనాథం మాస్టారి దైనందిన చర్యల్లో చివరి భాగం — వయొలిన్ మీద శోక గీతికలు ఆలాపించడం. ప్రతి రాత్రి ఆ చీకటి గదిలో ఒంటరిగా కూర్చుని కమాన్ కదలికతో రాగ ప్రసారం చేస్తుంటే అది వాద్యంలా తోచదు. ప్రతి రాత్రీ జీవితంలో అనుభవించిన శోకాన్నంతా సింహావలోకనం చేసుకుంటున్నారేమో అనిపిస్తుంది.

వయొలిన్ తరంగాలు గాలి ఓపికగా మోసుకెళ్ళినంత దూరం వ్యాపించి విషాదం పంచి పెడుతున్నాయి.

పక్కగదిలో చిరుగుల దుప్పటి మెడ వరకూ కలబోసి కప్పుకొని చింకి చాప మీద కూతు ళ్ళిద్దరూ పడుకొని ఉన్నారు. అదీ పేద వాలకంతో గజగజ వణుకుతూ నిద్రపోతున్నారు.

ఆ గదిలోనే ఓ మూల బల్ల మీద సెలవుమీద వచ్చిన శివం వెల్లకిలా పడుకొని చిల్లుల్లోంచి మెరుస్తున్న వెన్నెల కాంతి దూలాన్ని చూస్తున్నాడు.

వరలక్ష్మి దగ్గింది అవతల గది లోంచి — 'మెలకువగా ఉండు' అని హెచ్చరిస్తున్నట్టుగా. శివం మొహం చిట్లించుకున్నాడు. నిద్దర లేకపోవడం మూలాన, మట్టి గోడల మూలాన ఇంటివా ళ్ళుంటున్న ఆ వాటాలో శబ్దం ఈ వాటాలోకి, ఈ వాటాలోది అటు వినిపిస్తుంది.

ఒక పక్క చెవుల్లో తండ్రి వయొలిన్ వాద్యం సూటిగా ముల్లులా పొడుచు కుంటుంది. ఎంతసేపో విని, చివరికి లేచాడు. కోడిగుడ్డు దీపం పుచ్చుకొని పక్క గదిలోకి నడిచాడు. లోపలికి చొచ్చుకొచ్చిన దీపం కాంతి సూదంటు స్పర్శకి ఆయన మూసుకున్న కను రెప్పలు తెరుచుకున్నాయి. కమాన్ కదలిక ఆగిపోయింది. వయొలిన్ నిక్క

తంగా శబ్దిస్తూ ఆగిపోయింది. వరలక్ష్మి దగ్గింది.

"నాన్నగారూ, ఎంతసేపు వాయిస్తారు?"

"రేపు పిల్లలకి పాఠాలు చెప్పద్దూ? ప్రాక్టీసు చేస్తున్నా." ఏ భావం లేనట్టు కనిపించాలన్న తాపత్రయం బయట పడింది. దీపం వెలుగులో ఎండిన కన్నీటి చారలు ఎలా దాగుతాయి? అది ప్రాక్టీసో, పరితాపమో శివానికి తెలియని వయసు కాదు. తండ్రిని ఎలా ఊరడించాలో తెలియక "మీకు ప్రాక్టీసేమిటి, నాన్నగారూ? నిద్రపొండి" అనేసి వెనక్కి తిరిగాడు.

వరలక్ష్మి దగ్గింది. బలవంతంగా 'ఆయన్ని నిద్రపుచ్చి, నువ్వు నిద్రపోయేవు, జాగ్రత్త!' అని హుంకరించినట్టు దగ్గింది.

"ఏమిటే పాడు దగ్గు? సాయంత్రం వరకూ లేదు. రాత్రికి ఇలా ముంచుకొచ్చిం దేమిటో?" వాళ్ళమ్మ చిరాకు పడింది.

"దగ్గలేక అది ఛస్తూంటే మధ్య నీ సాధింపేమిటి?" పర్వతయ్య గొంతు.

"ఆ! నీకూ, దానికీ పనేముంది! దగ్గడం, తుమ్మడం." గొణుక్కుంటూ ముగించింది.

శివం బల్లమీద కూర్చున్నాడు. రెండు నిమిషాల నిశ్శబ్దం తరవాత వయొలిన్ తిరిగి మొదలయింది. పరుగెత్తి కమాన్ లాక్కోవాలన్నంత కోపం వచ్చింది. ఇంతలో తలుపు కొట్టిన చప్పుడయింది. శివం గుండెలు దడదడలాడాయి.

'వరలక్ష్మి కాదుకదా?' శరీరంలో ప్రకంపనాలు బయలుదేరాయి.

శివం వెళ్ళి తలుపు తీశాడు. జివ్వుమని పొడిచిన కెరటంలా చలిగాలి చొచ్చుకొచ్చింది. ఎదురుగా లాంతరు పుచ్చుకొని మాసిన షోలాపూర్‌దుప్పటి ముసుగులో పర్వతయ్య గబుక్కున లోపలికి వచ్చి, చలికి వణుకుతూ తలుపులు మూసేశాడు.

"అబ్బాయ్! నువ్వుండు. నేను మానిపిస్తాను. పొద్దు పోయింది. ఎంతసేపు బాధపడతాడు పెద్దమనిషి?" అని అతన్ని నెట్టుకొని లోపలికి వెళ్ళాడు.

వయొలిన్ ఆగిపోయింది.

వరలక్ష్మి పొడిగా దగ్గింది.

"ఏమయ్యా, బుద్ధుండక్కర్లే? ఇలా ఎన్నాళ్ళు బాధపడతావయ్యా? పిల్లలు బెంబేలు పడతారని ఇంగితం ఉండద్దూ? ఆవిడ నిన్న పోయిందా, మొన్న పోయిందా? పోయి రెండేళ్ళయింది. కొండలా పిల్లలకి ఆసరా ఉండడం మాని కోరి గుండె జబ్బు కొని తెచ్చుకొన్నావు. వేరే పనిలేదా రాత్రిళ్ళు? ఏడుపు ... ఏడుపు ... ఎడుపు గాకపోతే ఏమిటయ్యా ... అదేనయ్యా — పైకి కనిపించవనుకో ... బాగానే నటిస్తావు. ఆ చిన్న పిల్లలు మెలకువగా ఉంటే నీ కుయ్యి కుయ్యి మోత విని దిగులుపడిపోరూ?"

"... ..."

శివం మూసిన తలుపులకి చేరగిలబడి సంభాషణ వింటున్నాడు.

"అలా బాధపడి బాధపడి గుండె జబ్బు తెచ్చుకున్నావు. నువ్వు పాఠాలు చెప్పి సంపాదించే అరవై రూపాయలు... నీ కొడుకు పంపే రెండొందలు ఎవరికి పెడుతున్నావు? సగం డబ్బు గుండె జబ్బుకి జమ కడుతున్నావు. ఏదో ధైర్యంగా ఉండి, ఆరోగ్యంగా ఉండి పిల్లల్ని చూసుకుందామని లేదు. ఈ వయసులో ఎవరయ్యా నీకు చెప్పేది?"

"... ..."

"చెల్లెమ్మ బతికున్న రోజుల్లో ఎంతో కొంత సంపాదించే వాడివి. సంసారం నెట్టుకొచ్చేవాడివి. పిల్ల లెంత కళకళలాడేవాళ్ళు! టైముకి శివం అంది వచ్చాడు గాబట్టి సరి. లేకపోతే నువ్విలా ఉన్నందుకు సంసారం కుక్కలు చించిన విస్తరి అయ్యేది!.. పిల్లలకి అమ్మ లేదు, సరే ... నాన్న ఉన్నాడయ్యా!"

అమ్మ!

ఒక్కసారి శివం కళ్ళలో అమ్మ కదిలి ఒళ్ళు జలదరించింది. మెదడులోని జ్ఞాన నాళాల దొంతరల్లో తెల్లటి యవనికమీద నవ్వుతూ అమ్మ బొమ్మ! కళ్ళ వెంట నీటి పొరలు జాలువా మసక అద్దంలా అడ్డు పడింది.

అమ్మలా కనిపించడం వల్ల, చూపుల్లో చేష్టల్లో అమ్మని గుర్తు చెయ్యడంవల్ల వరలక్ష్మి తనకు బాగా దగ్గరయింది. కానీ, ఏం ప్రయోజనం?

కళ్ళు తుడుచుకొని గదిలోకి వెళ్ళి— "మామయ్యా, ఊరుకో. నాన్నగారు నిద్రపోతారులే" అని వారించాడు శివం.

"రోజూ నా కిది అలవాటేలే. ఇదిగో, దీన్ని లాక్కుంటేగానీ ఆగడు." వయొలిన్ కమాన్ లాక్కొని పెట్టెలో పెట్టి, చంకలో ఉంచుకొని, 'ఏమంటావు' అన్నట్టు చూశాడు.

రామనాథం మాస్టారు కళ్ళెత్తి పర్వతయ్య వంక చూసి నవ్వారు. అది ఏడుపుని మించిన నవ్వు. 'పర్వతయ్యా, నా వయొలిన్ లాక్కొన్నావు, నా హృదయాన్ని వదిలి పెట్టి!' అన్నట్టుంది ఆయన చూపు. ఆ చూపుని భరించలేక ఇద్దరూ గదిలోంచి నిష్క్రమించారు.

అవతల వరలక్ష్మి దగ్గుతూంది. శివాని కది 'పారా హుషార్' హెచ్చరిక.

"అబ్బాయ్,దీన్ని అలమరాలోఉంచు." చంకలో పెట్టె అందించాడు. లాంతరు బల్లమీద పెట్టి కూర్చున్నాడు. శివాన్ని పక్కన కూర్చోమని సంజ్ఞ చేశాడు. శివం సరసను చేరాడు. పర్వతయ్య బొడ్లోంచి చుట్ట తీసి నోట్లో దూర్చి పొడుగూనా తడిపి పెదాల మధ్య పెట్టుకున్నాడు. లాంతరు చేతుల్లోకి తీసుకొని చిమ్నీ పైకెత్తి సందులోంచి చుట్ట వెలిగించుకున్నాడు. ఇంత తీరిక చేసుకుంటున్నాడంటే కష్టం, ముఖం మాట్లాడే ఉద్దేశమని — శివానికి సంకేతం అది.

వరలక్ష్మి దగ్గింది.

అబ్బా! ఈ దగ్గు సిగ్నల్ ఒకటి. తన జీవితాంతం వెంటాడేలా ఉంది. 'రాత్రి పన్నెండు గంటలకి మన నిర్ణీత స్థలంలో కలుసుకోవాలి. ఈ సారి మన జీవితాలకి శాశ్వతమైన ఒప్పందం చేసుకోవాల్సిందే. ఎన్నాళ్ళు వాయిదా వేస్తావు?' అదీ దగ్గుతెర సారాంశం.

"ఏమయ్యో! కొలువు అయ్యిందిగా? ఆయనకి జోల పాడావుగా? ఇక వస్తావా?" అవతలి గదిలోంచి వరలక్ష్మి తల్లి కేక కఠినంగా వినిపించింది.

"నా మాటకేం గానీ నువ్వు మునగ తీసుకొని పడుకో."


"పడుకో కేం చేస్తాను నిన్ను కట్టుకున్నాక! అద్దె డబ్బులు రాలకపోయినా అందరి కష్టాలూ నీకే" అని గొణుక్కుంటూ విరమించుకుంది.

"అబ్బాయ్! అద్దె మా కొత్తిందని నువ్వు బాధపడకు. అదంతే ... అది సరే. ఎలా ఉంది నీ కరెంటు బిల్లు కలెక్టరు ఉద్యోగం? మీ ఆఫీసరు ఈ ఊరికి ట్రాన్స్‌ఫరివ్వడా?"

"ఇవ్వనన్నాడు, మామయ్యా. నాన్న జబ్బు గురించి, మా అవస్థల గురించి ఆయన కళ్ళకి కట్టినట్టు చెప్పాను. అంతా విని చూద్దాం అన్నాడు."

"అంటే పని జరగదని అర్థం.వన్నమాట. ఏం, డబ్బు తింటాడేమిటి? శవం మీద సుంకం వసూలు చేసే రకమా?"

"కాదు, మామయ్యా. సొంత ఊరు వెళ్ళితే నా గొడవల్లో పడి డ్యూటీ నిర్లక్ష్యం చేస్తానట. ఇల్లు, పొలం



బారెడ బండిలో పడి డ్యూటీ నిర్లక్ష్యం చేస్తేనట. ఉద్యోగస్తుల్ని సొంత ఊరు వెయ్యడమంత నేరం మరోటి లేదన్నాడు.''

''వాడి పిండాకూడు. నీకు ఇల్లు, పొలం ఎక్కడ? అద్దెకొంపని చెప్పక పోయావా?''

''చెప్పాను, మామయ్యా. ఆయనది ఏ సమస్యనైనా డ్యూటీ కళ్ళతో పరిశీలించే తత్త్వం. అసలు ఆయన్ని ఆడి పోసుకోవడం ఎందుకు? మన మాటేమిటి?'' అని అనుమానంగా కోడిగుడ్డు దీపం పుచ్చుకొని లేచాడు. తండ్రి గది లోకి వెళ్ళి దీపం వెలుగులో చూశాడు. 'అమ్మయ్య! నిద్ర పట్టింది' అనుకొని ఇవతలికి వచ్చాడు. దీపం బల్లమీద పెట్టి ''మన మాటేమిటి, మామయ్యా? ఈయన నాతోబాటు ఆ ఊరొచ్చేస్తే అసలు సమస్య అంటూ ఉందా? ఈ ఊరు నుంచి, అసలు ఈ ఇంట్లో నుంచి రానని పట్టుబడితే నేను ఏం చెయ్యను?''

''పెద్ద చిక్కే ఈయనతో.''

''మామయ్యా, మూలకారణం నువ్వు.''

''నేనా?''

''అవును. అద్దె బకాయిలు చెల్లించ లేదని వీళ్ళని ఇంట్లోంచి వెళ్ళగొడితే ... ఎంత బాగుంటుంది! ఆయనకి స్థలం మార్పు అవు, ఇంకేమైనా అవు - కొంచెం మేలు జరిగేది. ముందు ఇంట్లో ఎంపి గెంటు. తరవాత ఊరు మార్చే బాధ్యత నాది. నా దగ్గరికి తీసుకు పోతాను. అమ్మ ఆ గదిలో పోయింది. అదే ఆయనకి నివాసగృహం అయిపో యింది. సంతోషం, సాధనా, దుఃఖం, ఆకలీ, నిద్రా—అన్నీ అక్కడే. ఎంత ధైర్యం! సొంత ఇల్లులా ... ఏదో ఓపిక తెచ్చుకొని నయొలిన్ పాఠాలు చెబుతారు ఆ గదిలో.''

''అయితే, చివరికి నాది తప్పని తేల్చా వన్న మాట!''

''అదికాదు, మామయ్యా. నాకు ఉద్యోగం వచ్చిన తరవాత ... ఉన్నంత లోనే నాన్నని, చెల్లెళ్ళని పోషించుకొనే అవకాశం లేదా? నేనేగా వాళ్ళకి దిక్కు? నెలనెలా డబ్బు పంపుతున్నా ననుకో! అదేం సరిపోతుంది ఎంత ఒక పూట తింటే మాత్రం?'' అనేసి తడబడ్డాడు.

పర్వతయ్య కళ్ళు విస్ఫారితాలయ్యాయి. విస్ఫులింగాలయ్యాయి.

''ఏమిటీ! ఒక్క పూట తింటు న్నావా?''

వరలక్ష్మి ఆందోళనగా దగ్గింది.

శివం తప్పించుకోవాలన్నా దారి లేక పట్టుబడిపోయాడు. తల వంచుకొన్నాడు. పర్వతయ్య అతని గెడ్డాన్ని పైకెత్తి, ''వెధవ్వి! అందుకే చిక్కిపోయావు'' అన్నాడు.

''అదేం లేదు, మామయ్యా. వంట చేసుకుంటే రెండు పూటలూ సుష్టుగా తినచ్చు. డ్యూటీ వల్ల టైము కుదరదు. అందుకే హోటల్లో ఒక పూట ...''

''ఒక్క పూటలో ఎలా సరిపెట్టు కుంటున్నావయ్యా?''

'అన్యాయం!' అని అరిచినట్టు వరలక్ష్మి దగ్గింది.

ఎందుకు తనమీద వరలక్ష్మికంత మమకారం? తిండి ప్రసక్తి వస్తే ఎప్పటికి తల్లిలా తల్లడిల్లుతూంది. కాస్త తనే వరానికి న్యాయం చెయ్యలేపో తున్నాడు.

రెండు పూటలకీ నడుమ మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ఒక్క టిక్కెట్టుతో రెండు పూటలకీ సరిపడ్డ భోజనం చేస్తున్న దృశ్యం శివం గుర్తుకు తెచ్చుకున్నాడు.

'జిల్లా కలెక్టరు శివం రెండో పూట హోటల్‌కి రాడే?' అన్న హోటల్ వా సందేహం కలుక్కుమంది.

''మామయ్యా, ఈ విషయాలకే గానీ, మమ్మల్ని ఎప్పుడు తల చేయిస్తావు?''

పర్వతయ్య లాంతరు పుచ్చుకు దిగ్గున లేచి పోయాడు. ''సరి సరి, నా పెట్టావు కుంపటి!''

''అద్దెకు ఉండే వాళ్ళ మీద అంతం అభిమానాలు పెంచుకోకూడదు మామయ్యా.''

వరలక్ష్మి దగ్గింది. అనుకున్నా సరిగ్గా దగ్గుతుందని. 'నీ మాటేమిటి అని విలేసి అడుగుతున్నట్టు ధ్వనించింది.

''అభిమానం నీకూ ఉండబట్టే 'మామయ్యా' అని పిలుస్తావు? నే హో అమ్మ అన్నా మరి?''

శివం మాట్లాడలేక పోయాడు.

''మరి అదే పాయింటు — ఇం చేసి ఎంత అభిమానాలు పెంచుకుం మరి డబ్బు ముందు ఓడిపోతాం.''

''ఏం?''

''అనుకున్నట్టు మీరు ఇల్లు ఖా చేసే రోజు వస్తుంది, బాబూ. ఇల్లు అమ్మేస్తున్నాను.''


నెలనెలా ఓకో నవల అందిస్తుంది

జ్యోతి

అంతేకాదు
ఆ నవలకు ప్రత్యేక ముఖచిత్రాలంకారం కూడా!!

పాఠకాభిరుచులకు దర్పణమైన

జ్యోతి

విషయ పరంగానూ
వినోదాన్నిచ్చేదిగానూ
విమర్శనాపరంగానూ కూడా
జ్యోతే

జ్యోతి, సచిత్ర మాసపత్రిక, టి నగర్, మద్రాసు-600 017

అతి త్వరలో
శ్రీమతి ఆరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవి
సత్యం శివం సుందరం నవల ధారావాహికంగా ప్రారంభం

"ఇల్లా! ఎందుకు, మామయ్యా?"

"వరలక్ష్మి పెళ్ళి చెయ్యాలి కద?"

అటు తిరిగిన పర్వతయ్యకు తెలియకుండా శివం కళ్ళు గుప్పున వెలిగాయి. ఈ సారి వరలక్ష్మి దగ్గు తెరలు తెరలుగా తెచ్చుకుంది.

"ఇప్పు డెందుకులే అమ్మకం గొడవ" అని తలుపులు తెరుచుకొని వెళ్ళిపోయాడు పర్వతయ్య.

• • •

రాత్రి పన్నెండయింది.

కోర్టులో కాపలాదారు గంటలు కొట్టిన శబ్దం వినిపించింది. వరలక్ష్మి దగ్గింది. గాజులు విదిల్చింది.

శివం తప్పదన్నట్టు లేచాడు.

తండ్రి, చెల్లెళ్ళు నిద్రపోతున్నారు. చల్లగాలికి తడిసి బట్టలు మెత్తబడ్డాయి. చెల్లెళ్ళ ఒంటి మీద తొలగిన దుప్పటి సరిచేసి కప్పాడు.

మెల్లగా తలుపు తీసుకొని బయట గొళ్ళెం పెట్టి రోడ్డెక్కాడు. దూరంగా సెంటర్లో నలుగురు రిక్షా వాళ్ళు గుమికూడి పాత టైరు అంటించి, గుండ్రటి మంట చేసుకొని ఒళ్ళు కాచుకుంటున్నారు.

శివం వీధి చివర శివాలయం చేరుకున్నాడు. వరలక్ష్మి దొడ్డి గుమ్మం తెరుచుకొని మరోదారి గుండా గుడి చేరుకుంది. మబ్బులు. వడబొయ్యగా మిగిలిన వెన్నెల నేలని చేరుకుంటూంది.

శివం స్తంభాన్ని ఆనుకొని చప్టా మీద కూర్చున్నాడు. వరలక్ష్మి మౌనంగా ఎదురుగా కూర్చుంది. గచ్చు మీద చూపుడు వేలితో ఉత్తి ముగ్గులు గీస్తూ తల వంచుకొని శివం కంఠం కోసం ఎదురు తెన్నులు చూడసాగింది... ఉద్వేగాల అగ్నిలో చలి బాధ మాయమయింది.

"ఇల్లు అమ్మేస్తారటగా?"

"అవును. నీకు సంతోషంగా ఉందా?"

"నాన్న విషయంలో పరిష్కారం దొరికింది. నీకు పెళ్ళవుతుంది. ఇంతకంటె ఏం కోరుకోను?"

"మరి నా విషయం?"

"నువ్వు పెళ్ళికి నిర్ణయించుకున్నట్టేగా?"

"ఎంత దారుణంగా మాట్లాడుతున్నావో ఆలోచించు. నీ నిర్ణయాన్ని నిర్దయగా మార్చుకొని, నిర్ణయం నా దంటావా?"

"వరం! నీ కెన్నిసార్లో చెప్పాను మనసు మార్చుకోమని."

"చాలా తేలికైనట్టు చెబుతున్నావు!"

"కాకపోతే ఏం చేశానని ... చొరవ తీసుకొని ఒక్కనాడైనా నీ చెయ్యి ముట్టుకున్నానా?"




"చెయ్యి ముట్టుకుంటేనే జీవితాలు పోయినట్టు లెక్కకాదు. అంతకుమించి మనసుని కబళించివేశావు. ఎందుకిలా చేశావు? అలా ప్రేమించడం, ఇలా కాదనడం—అంతా నీ ఇష్టమేనా?"

"వరం, ఒక్కోసారి ఆలోచిస్తే — ఎంత బాధ్యతారహితంగా ప్రేమించుకున్నాం అనిపిస్తుంది. సంపాదన శక్తిలేని వాడు ప్రేమించడానికి అనర్హుడేమో?"

వరలక్ష్మి కళ్ళలో తడి తల ఎత్తింది.

"నిన్ను ప్రేమించిననాడు నేను కేవలం తల్లితండ్రుల మీద ఆధారపడ్డ వాణ్ణి. ఏ ధైర్యంతో నీతో మనసు కలిపానో ఇప్పుడు తలుచుకుంటే ఆశ్చర్యం వేస్తుంది. సరే, ఉద్యోగం వచ్చింది. సంపాదనాపరుణ్ణి అయ్యానని మురవడానికి కూడా వీలులేకుండా అమ్మ హఠాత్తుగా కన్ను మూసింది. ఇంటి పరిస్థితులు తారుమారయాయి. గుండె జబ్బుతో నాన్నగారు, చెల్లెళ్ళు, వాళ్ళ నిగులు జీవితాలు ..."

"నేనొక్కదాన్నే బండరాయిలా పడున్నాను — ఏ బాధా లేకుండా. నీ కష్టాలు నావి కావా? నీ తండ్రి, చెల్లెళ్ళు నా వాళ్ళు కారా? నన్ను చేసుకుంటే నేను నీకు బరువా? వాళ్ళు నాకు బరువా?"

"వరం, నీకు ఎలా చెప్పేది! నాన్నగారిని నాతో తీసుకుపోయి, ఆయనకో కొత్తజీవితం కల్పించాలని నా ఆరాటం. వయొలిన్ పాఠాలు లేవు. సాధనా లేదు. ఆయనకు నా దగ్గర పూర్తి విశ్రాంతి కల్పిస్తాను. దగ్గరుండి వైద్యం చేయిస్తాను. నా జీతంలో సగభాగం ఇందుకే ఖర్చు చెయ్యాల్సి ఉంది. మిగతా జీతంతో ఇల్లు గడపాలి; చెల్లెళ్ళని తీర్చిదిద్దాలి. వాళ్ళ పెళ్ళిళ్ళు చెయ్యాలి. ఈ ప్రయత్నంలో ఇక నా పెళ్ళి ఎలా కుదురుతుంది? నన్ను క్షమించు. మామయ్య కుదిర్చే పెళ్ళికి ఒప్పుకో."

"కలో గంజో తాగడానికి నేను సిద్ధమైనప్పుడు కాదంటే అది నీ తప్పవుతుంది, శివం. దీని పర్యవసానానికి బాధ్యత నీదే."

"కావచ్చు. వరం. అన్నిటికీ సిద్ధమైపోయాను. నువ్వు మాలా నిక్కృష్టంగా బ్రతకకూడదని నీ మనిషిగా నా స్వార్థం అది."

"మాటల గారడీ కట్టిపెట్టు, శివం. ఇన్నాళ్ళూ సెలవు మీద వచ్చినప్పుడెల్లా ఆలోచించుకోమని పదే పదే నా అభ్యర్థనని పొడిగిస్తూ వచ్చావు. ముష్టిదానిలా దేవిరించాను. ఇది ఆఖరి సారి." వరలక్ష్మి గొంతులో ఆవేదన సుస్పష్టమయింది. ఏడుపు కలిసిన మాటలు హృదయ కుహరంలో పుట్టినట్టు వినిపించాయి. చెంపల మీద కన్నీటి సరాలు వెలిశాయి.

శివం లేచాడు.

"అంతే, వరం. అదే నా నిర్ణయం" అని వడివడిగా నడిచి వెళ్ళిపోయాడు.

• • •

చలి రాత్రి తెల్లవారింది.

తండ్రిని లేపాలని గదిలోకి వెళ్ళిన శివం అదిరి పడ్డాడు. రామనాథం మాష్టారు నిశ్చలంగా ఇల్లు మారే పని లేనట్టు, ఊరు వదిలే ప్రసక్తి లేనట్టు నిశ్చింతగా పడుకున్నట్టుంది. శివానికి ఎంత ప్రయత్నించినా కంఠంలో కేక గొంతుక పొలిమేరలకి రాలేదు. గుండెలో ఏడుపు కరవయింది. బిగుసుకుపోయాడు. తన ఒంటిపూట భోజనం, పర్వతయ్య ఇల్లు అమ్మకం, ఊరు మార్చే ప్రయత్నం, వరలక్ష్మిని తిరస్కరించిన దైన్యం — అన్నీ తెలుసుకున్నట్టుంది ఆయనవాలకం. ఇలాంటి భావం ఆయన ముఖ కవళికల్లో కల్పించుకొని ఊహించుకున్న శివం గొంతెత్తి 'నాన్నా' అని అరవలేకపోయాడు. అంత షాక్‌లోనూ వరలక్ష్మి బొమ్మ అటూ, ఇటూ కొట్టుమిట్టాడింది.

అంతలోనే ...

కర్ర బద్దలు చీల్చి పాడె కడుతున్నట్టు, 'జాగ్రత్త, జాగ్రత్త. దెబ్బ తగిలేను' అని ప్రాణం లేని శరీరాన్ని పాడె మీద పడుకోబెట్టినట్టు, మోసుకెళ్ళినట్టు, నిప్పు ముట్టించినట్టు, కుండ పగిలినట్టు, ఎగిసి పడుతున్న చితిమంటల్లో కూడా వెళ్ళిన వాళ్ళు చలి కాచుకుంటున్నట్టు—ఏవేవో భయంకర దృశ్యాలు.

• • •

ఆ రోజుకి రామనాథం మాస్టారు దివంగతులై పదిహేను రోజులయింది. కావలసిన కర్మకాండలన్నీ పూర్తిచేశాడు శివం.

మర్నాడు చెల్లెళ్ళతో ఆ ఊరు వదిలి వెళ్ళి డ్యూటీలో జాయినవ్వాలని నిశ్చయించుకున్నాడు.

పర్వతయ్య భార్యను హాస్పిటల్‌కి తీసుకెళ్ళాడు, ఒంట్లో నలతగా ఉందని.

వరలక్ష్మి ఇంట్లో ఒంటరిగా ఉంది.

శివం తలుపు తట్టి వరలక్ష్మిని పిలిచాడు.

తలుపులు తెరుచుకున్నాయి.

ఎవరో అపరిచితుణ్ణి చూసినట్టు చూసింది ఆమె.

"వరం, నేను రేపు ఊరెళుతున్నాను."

"మంచిది."

"చెల్లెళ్ళను తీసుకెళుతున్నాను."

"ఊఁ"

"త్వరలోనే వస్తాను. మామయ్యను ఇల్లు అమ్మవద్దని చెప్పు."

"ఎందుకు?"

"నిన్ను పెళ్ళి చేసుకుంటాను."

"నువ్వెవరు చేసుకోవడానికి? కాదనే అవకాశం నాకూ ఉంటుందని గుర్తుంచుకో."

"వరం! పరిస్థితుల్ని అర్థం చేసుకోకుండా ..."

"అనవసరం. నా కా అగత్యం లేదు. కలో గంజో తాగుదామన్నా కాదన్నావు. మా నాన్నగారు నా కడ్డు అని నీ ఉద్దేశ్యమా? ఇప్పుడు నాన్నగారు లేరు. డబ్బు మిగులుతుంది. నన్ను అందలం ఎక్కించాలని వచ్చావా? ఏ నాడు నువ్వు నిరాకరించావో ఆ నాడే మనసు మార్చుకున్నాను. నా అభిమానం నా కుంది. నా పెళ్ళి విషయం ప్రస్తావించే అధికారం నీకు లేదు. ఈ ఇల్లు అమ్మి తీరాలి. నా పెళ్ళి జరిగి తీరాలి."

"అంతేనా, వరం!"

"ముమ్మాటికీ అంతే" ఆమె కొంగు నోటికి అడ్డంగా పెట్టుకుని చెంగున లోపలికి పరుగెత్తింది. ఏదో జీవిత శిల పెళ్ళున బద్దలయిన శబ్దం. అందులోంచి వింత జల పుట్టి, జలజలా ప్రవహిస్తున్నట్టు నవ్వాడి.

శివం బయటికి నడిచాడు.